# నీదాకా వస్తే?

ఉదయం పదిన్నర గంటలు అయ్యింది.

అప్పుడే ఆఫీసుకి అందరూ వస్తూ ఎవరెవరి డిపార్ట్‌మెంటుల్లోకి వాళ్ళు వెళ్ళి అటెండెన్సులో సంతకాలు పెట్టి సీట్లలో కూర్చుంటున్నారు.

ఆ ఆఫీసులో అది "ఎ" డిపార్టుమెంటు.

అప్పారావు అటెండెన్సులో సంతకం పెట్టి డిపార్ట్‌మెంటంతా కలియ జూశాడు. అప్పటికే డిపార్ట్‌మెంటులోని వాళ్ళంతా వచ్చేశారు ఒక్క సుశీల తప్ప.

సుశీల రాకముందే తను చూసిన విషయం డిపార్ట్‌మెంట్లోని అందరికీ చెప్పెయ్యాలి!.... కాస్త ఆలస్యం జరిగితే ఇంకేమైనా ఉందా ?!.... కొందరు క్యాంటీనుకి, కొందరు మార్నింగ్‌షో సినిమాలకి వెళ్ళిపోతారు.

అప్పారావు అందర్నీ పిలిచాడు.

అప్పారావు అలా పిలిచాడంటే ఏదో విశేషం ఉండే ఉంటుంది. అందుకే అందరూ హుషారుగా అతని దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చారు. అలా పరుగు పెట్టడంలో కాళ్ళు తట్టుకొని ఒకరిద్దరు బోర్లా పడిపోయారు.

"మీ కంగారు మంటెట్టా... కాస్త చూస్కొని పరిగెత్తండ్రా...." అన్నాడు వాళ్ళ ఉత్సాహానికి సంబరపడిపోతూ అప్పారావు.

"సర్లె.... సర్లె.... ఆ చెప్పేదేదో త్వరగా చెప్పు... లేకపోతే నీ కడుపులోనే కుళ్ళిపోతుంది...." అన్నాడు అసిస్టెంట్ సెక్షనాఫీసరు ఆనంద రావు కిందనుండి లేచి మోకాళ్లు రుద్దుకుంటూ.


"మరేమో... నిన్ననేమో.... నేనేమో.... సాయంత్రమేమో.... ఆఫీసయ్యాకేమో.... ఆరుగంటలకేమో...."

"ఈ...." అన్నారు చుట్టూ మూగినవాళ్ళు పళ్ళు బిగబట్టి, అత నలా నాన్చడం తట్టుకోలేక.

"నువ్వు త్వరగా చెప్తావా లేకపోతే నీ పీక పిసికేమా ?..." అన్నాడు యుడిసి సుబ్బారావు.

వాళ్ళ బాధ చూస్తుంటే అప్పారావుకి మరింతగా ముచ్చటేసింది వాళ్ళని ఏడిపించాలని.

"అలాగే చెప్తా.... చెప్పేస్తా... మరేమో.... నిన్నసాయంత్రం నేను అబిడ్స్‌లో సుశీలని— సుశీలని.... హిహి...." అన్నాడు చెప్తున్నది ఆపి అందరివంకా చూస్తూ.




"ఆ.... సుశీలని ?.. ఏం చేశావు చెప్పు ?"

"ముద్దెట్టుకున్నావా ?...."

"చెయ్యిపట్టుకున్నావా ?...."

"సినిమాకిగానీ డిన్నర్‌కిగానీ ఇన్వైట్ చేశావా ?"

అందరూ ఆతృతగా అప్పారావు మీద పడి జుట్టుపీకేస్తూ, చొక్కా నలిపేస్తూ అడిగారు.

"హి...." అన్నాడు ఏమీ చెప్పకుండా అప్పారావు సిగ్గుపడ్తూ.

"ముద్దు పెట్టుకున్నావా ?"

ఆనందరావు అప్పారావు కాలర్ పట్టుకుని కుతూహలంగా అడిగాడు.

"ఉహూ.... అబిడ్స్‌లో.... అంత జనంలో అదెలా కుదుర్తుందీ?.." అన్నాడు అప్పారావు ముసి సిగా నవ్వుతూ.

"మరేం చేశావో త్వరగా చెప్పి తగలడు...." అన్నాడు యల్డీసీ రామనాథం ఆత్రంగా, అప్పారావు చేతిని వెనక్కి విరిచేసి మెలిబెడ్తూ.

"అబ్బో.... అబ్బో.... ఎంతాత్రమో!!.... మీకెంతా త్రమో !!—" ఆనందంతో తలమునకలయ్యింది అప్పారావుకి.

"ఆత్రమా నీ బొంద.... త్వరగా చెప్పి తగలడు— ఇప్పుడు సుశీలొచ్చిందంటే నీకు చెప్పడానికి కుదర్దు —" అన్నాడు వీరావేశంతో స్టెనో వీరాంజనేయులు.

ఆ మాట వింటూనే అప్పారావు నాలుక కొరుక్కుని చెంపలేసుక్కున్నాడు.

"అవును కదూ?.... ఆ విషయమే మర్చిపోయా"

"ఊ... మరి హు చెప్పు.... ఏం చేశావో చెప్పు..." అన్నారు ఉత్సాహంగా అప్పారావు పీక పిస్కుతూ.

"మరిలా నా బట్టలు నలిపేసి నా చెయ్యి మెలిబెట్టేసి, నా పీక పిసికేస్తుంటే నేనేం చెప్పనంతే —" అన్నాడు అప్పారావు చిర్రుబుర్రులాడ్తూ.

అందరూ అతనికి దూరంగా జరిగి చెంపలేసుక్కున్నారు.

"సారీవోయ్.... ఇప్పుడు చెప్పు.... సుశీలని ఏం చేశావ్ ?" ఆనందరావు అప్పారావు చొక్కా కాలర్ని కసిగా నలిపేస్తూ అడిగాడు.

"నేనేం చేస్తాను ?" అన్నాడు అప్పారావు ఛిలిపిగా.

వాళ్ళందరికీ అతని మీద పీకల్దాకా కోపం వచ్చింది.

"మరిందాకట్నుండీ సుశీలని.... సుశీలని... అంటూ మెలితిరిగిపోతున్నావుగా.... ఏం చెయ్యనివాడివి అలా మెలితిరిగిపోవడం ఎందుకూ?" అందరూ గట్టిగా అరిచారు.

"నేనేం చెయ్యలేదుగానీ.... అబిడ్స్‌లో సుశీలని ఒకబ్బాయితో తిరగడం చూశాను —"

"ఊ.... తర్వాత ?" వీరాంజనేయులు ఉత్సాహంగా అడిగాడు.

"వాళ్ళు ఒక రెస్టారెంటులో దూరారు...."

"ఒకవేళ ఆ అబ్బాయి సుశీల అన్నయ్యేమో !" అడిగాడు రాముడు అనే మంచి బాలుడు.

అతని ప్రశ్నకు అందరూ ఘొల్లుమని నవ్వారు.

"నీ మొహం — అన్నయ్య లెక్కడైనా చెల్లెళ్ళని సినిమాలకీ, రెస్టారెంట్లకీ తీసెక్కెళ్తారా ?—" అందరూ రాముడ్ని తిట్టిపోశారు.

"ఒకవేళ ఆ అమ్మాయికి కాబోయే భర్తేమో !! —" మళ్ళీ అన్నాడు రాముడు.

"నువ్విహ మాట్లాడావంటే పీక పిసుకుతాం...." అందరూ కోపంగా అన్నారు అతని పీకపైపు చేతులు చాపుతూ.

రాముడు నోర్మూసేస్కున్నాడు.

"ఆ — నువ్వు చెప్పవోయ్ అప్పారావ్ ?— తర్వాతేమైంది ?" అన్నాడు సుబ్బారావు.

"ఏముందీ ?— రెస్టారెంట్లో వాళ్ళిద్దరూ కోళ్ళు కుక్కలూ మింగి ఉంటారు — అంతే"

"ఇంతకీ ఆ అబ్బాయి ఎవరయి ఉంటాడు ?"

"ఎవరేంటి — లవర్ అయి ఉంటాడు —" అన్నాడు అప్పారావు.

"ఎన్నో లవరో ?" వీరాంజనేయులు నిట్టూరుస్తూ అన్నాడు.

అందరూ ఘొల్లుమని నవ్వారు.

అదే సమయంలో సుశీల డిపార్ట్‌మెంట్లోకి అడుగు పెట్టింది..

"హలో.. గుడ్‌మార్నింగ్ ఎవ్రీబడీ ..." అందామె అపెండెన్సులో సంతకం పెడ్తూ.

"గుడ్‌మార్నింగ్ మేడమ్ .." అన్నారు అందరూ మెలికలు తిరిగిపోతూ.

సుశీల వెళ్ళి సీట్లో కూర్చుంది.

అప్పారావు అందరికీ కన్నుకొట్టి చూడండి ఇప్పుడేం చేస్తావో అన్నట్టుగా సైగచేసి మెల్లగా సుశీల దగ్గరికి వెళ్ళాడు.

"ఏమండి .." మెల్లగా పిలిచాడు.

సుశీల తలెత్తి చూసింది.

"పోయిన వారం మీచిన్న చెల్లెలికి జ్వరంగా ఉందని చెప్పారుగా.. ఇప్పుడా పాపకి ఎలా ఉందండీ ?" అని అడిగాడు.

"జ్వరం మొన్ననే తగ్గిపోయిందండీ... కాస్త నీరసంగా ఉంది.."

"కాస్త పళ్ళరసాలు పట్టండండి... నీరసం తగ్గిపోతుంది..."

సుశీల నవ్వింది.

"డాక్టరులాగా సలహాలు బాగానే ఇస్తున్నారే ?!"

"హిహిహి..." మెలి తిరిగాడు అప్పారావు.

"ఇంకేంటి చెప్పండి "

"అబ్బే.. ఊర్కే.. ఏం లేదు... ఆ విషయం కనుక్కుందా.. మనే..." అదే మీ చెల్లి విషయం... ఇప్పుడు బాగానే ఉందిగా... హి. వస్తానండీ హిహి !" అని అప్పారావు గుంపు దగ్గరకు వెళ్ళాడు.

అందరూ ఉత్సాహంగా అతన్ని చుట్టుముట్టారు.

"ఏం మాట్లాడావ్ గురూ.. చెప్పవా గురూ చెప్పావా ?.."

అప్పారావు పీక పిసికేస్తూ ఉత్సాహంగా అడిగాడు వీరాంజనేయులు.

"ఏవండీ బాగున్నారా అని అడిగాడు. బాగున్నాను అంది. మీ కళ్ళు బాగుంటాయండీ అన్నాను. థాంక్సండీ అంటూ నవ్వింది. మీ నవ్వు మరీ బాగుంటుందండీ అన్నాను. అలాగా అంటూ నవ్వింది. అప్పుడప్పుడూ వచ్చి మాట్లాడుతూండండి అంది" అన్నాడు అప్పారావు కోతలుకోసేస్తూ.

"అబ్బో భలేగా మాట్లాడావే !!" మెచ్చుకున్నారు అందరూ.

"మాట్లాడ్డం ఏం కర్మ! నేను తల్చుకుంటే ఇంకా ఏమైనా చెయ్యగల్ను సినిమాలకీ పార్కులకీ తీస్కెళ్ళగలను ఏ హోటల్ రూమో బుక్‌చేసి హి హి హి" సిగ్గుపడ్డాడు అప్పారావు.

"మరింకా ఆలస్యం దేనికి ?" ఉత్సాహంగా అన్నారు అందరూ.

"ఆ నాకిలాంటి విషయాల్లో పెద్దగా ఇంట్రెస్టు లేదు....మనకోసం

పడిచచ్చేవాళ్ళు అలా ఉంటూనే ఉంటారు. అందరితో వెళ్ళిపోతే ఎలా ?" అన్నాడు అప్పారావు పోజులుకొడ్తూ.

"హి....హి....హి" అన్నాడు ఆనందరావు మెలికలు తిరిగిపోతూ.

"నీ కేమైంది?" అందరూ ఆత్రంగా అడిగారు.

"బి- డిపార్టుమెంట్లో అరవింద లేదూ?....హి!"

"ఏంటో త్వరగా చెప్పి తగలడు" కుతూహలం పట్టలేక చుట్టూ చేరి అతని చొక్కా- జేబుని పర్రున లాగేశారు.

"ఆ అమ్మాయి నేనంటే పడి చస్తుంది. ఓ రెండుసార్లు నా స్కూటర్ వెనకాల లిఫ్టుకూడా ఇచ్చాను.." మురిసిపోతూ అన్నాడు ఆనందరావు.

"ఆ నీ మొహంలే ఆ అమ్మాయికి నేనుకూడా లిఫ్టు ఇచ్చాను మరిహాపోతే సి- డిపార్టులో వనజ ఉందే ఆ అమ్మాయి అయితే వంద రూపాయలిస్తే పక్కన పడుకుంటుంది ఇంకా"

అలా ఆఫీసులోని అందరు ఆడవాళ్ళ గురించి తృప్తిదీరా ఎప్పట్లా సాయంత్రం దాకా మాట్లాడుకున్నారు.

ఆఫీసవగానే సాయంత్రం విజిలేసుకుంటూ ఇంటికెళ్ళిన అప్పారావుకి ఎర్రగా ఉబ్బిపోయి ఉన్న కళ్ళతో భార్య రమణి కనిపించింది అప్పారావుకి.

"ఏంటి బాగా ఎడ్చినట్టున్నావ్? మీ ఆఫీసులో ఆసరేమైనా చివాట్లు పెట్టాడా? నీకు రావాల్సిన ప్రమోషన్ వేరేఎవరికైనా ఇచ్చారా?" అడిగాడు.

"అవేం కావు" అంది వెక్కుతూ రమణి.

"మరి ?"

"మా ఆఫీసులో కొందరు పనికిమాలిన వెధవలు నా గురించి అడ్డమైన వాగుడు వాగుతున్నారని తెలిసింది. నాది చాలా లూజ్ క్యారక్టరటా. అందరు అబ్బాయిలతో తిరుగుతానట ?! వందరూపాయలిస్తే చాలు పక్కన పడుకూంటానట చెప్పుకు పోతోంది.

అప్పారావు తెల్లమొహం వేసాడు.